
## మానేజిమెంట్ కథలు


కొరియన్ జానపద కథ ఆధారంగా...

మామ్మో! ఎంతెత్తు పైకప్పో!" హర్ష అసంకల్పితంగా అనేశాడు.
జోషీగారు చిరునవ్వుతోనూ, చిరుమందలింపుగానూ చూశారు.
అయిదు నక్షత్రాల ఆధునిక పూటకూటింట్లో కడుగు పెట్టడం హర్ష కదే మొట్ట మొదటిసారి. శరత్, మదన్‌లకు ఒకటి రెండు సార్లు పరిచయమే.



# పొద్దుతిరుగుడు పూలు

## దాసరి అమరేంద్ర



బంజారా హిల్స్‌లో దూరపు హుస్సేన్ సాగర్ కనబడేలా ఈ మధ్యే కట్టిన ఫైవ్ స్టార్ హోటల్ 'అభిలాష'. అత్యాధునికమైన హోటల్‌కి ఉండాల్సిన అన్ని హంగులూ దిట్టంగా కొండొకచో శ్రుతి మించి మరీ ఉన్నాయి. ప్రధానమైన ఆవరణ మధ్య చూసే వాళ్లకు గ్లాస్ టవర్ అది. అన్ని ద్వారాలూ గాజువే. లిఫ్ట్‌లో నుంచే బయటి ప్రపంచం, హుస్సేను సాగరం రాత్రీ పగలూ స్పష్టంగా కనిపించేలా కట్టారు. ఎకరపు మేర ఉన్న లాంజ్‌లో మామూలు వాళ్ల ముట్టుకోవడానికే భయ పడే తివాచీలూ, సోఫాలూ, మొగలాయీ కట్టడాలల్లా అరవై అడుగుల పై కప్పు, అడుగున అల్లప్పటి మైకలాంజిలో స్థాయిలో ఎమ్మెఫ్ హుస్సేన్ గారి మ్యూరల్సూ - అదో విచిత్ర వాతావరణం. అలాంటి వాటితో పరిచయం లేని హర్షతో ఒక్క సారిగా 'హమ్మో' అనిపించేసింది.

"సర్! ఇలాంటి గాజు ఇళ్లు కట్టే వాళ్లకు ఆ టీ.వీ. పిశాచం గుర్తు రాదూ!" శరత్ చతురోక్తి.

"సామాన్యులు ఎంత బలంగా రాయి విసిరినా, ఇంటి దరిదాపుకైనా రాలేనప్పుడు ఎన్ని గాజు ఇళ్లనైనా కట్టొచ్చు!" మదన్ చమత్కారం.

అంతా లిఫ్టెక్కి పద్దెనిమిదో అంతస్తులో ఉన్న విందుల గది చేరారు. సమయం రాత్రి ఎనిమిది. భాగ్య నగరం దీపాల కాంతిలో ఏడువారాల నగలను ఒకే సారి ధరించిన యువరాణిలా ధగధగా మెరిసి పోతోంది.

* * *

వ్యవసాయానికీ, హోటళ్లకూ, సినిమా హాళ్లకూ, సినిమాల నిర్మాణానికీ పరిమితమైన ఆంధ్ర దేశపు ధనిక వర్గం ఎనభైలలో మేలుకొని, ప్రపంచపు పోకడలను గమనించి తన దృష్టిని పారిశ్రామిక రంగం వైపు మళ్లించింది. హైదరాబాదు కేంద్రంగా చేసుకుని అనేకానేక పరిశ్రమలు పుట్టుకొచ్చాయి. ధన స్వామ్యపు నీతి సూత్రాల ననుసరించి అందులో అనేకం పురిటిలోనూ, మరి కొన్ని శైశవంలోనూ కొండెక్కగా, బహు కొద్ది పరిశ్రమలు మాత్రం ఎదుటి వారి బలహీనతలనూ, తమ తమ శక్తియుక్తులనూ జోడించి, అపూర్వంగా మేళవించి నిదొక్కుకుని పటిష్ఠంగా రూపొందాయి. ఎలక్ట్రానిక్స్ రంగంలో అలా బలపడిన వాటిలో 'సువర్ణా సర్క్యూట్స్' ఒకటి.

చిన్న ఎత్తున పెద్ద పెద్ద టీ.వీ. కంపెనీలకు సప్లయర్లుగా మొదలైన సువర్ణా వారి కార్య సరళి అయిదేళ్ల స్వల్ప వ్యవధిలో అందరి అంచనాలనూ మించి పోయి, తమంతట తామే టీ.వీ.లు, వి.సి.ఆర్.లు తయారు చేసే స్థాయికి చేరుకుంది.

ఎనభయ్యో దశకారంభంలో ఎంతో ఆశాజనకంగా కనిపించిన భారత టీ.వీ. విపణి ఎనభైల చివర్లలో ఉత్పత్తిదారులు శ్రుతి మించి పెరగడం వల్ల, కొనే వాళ్ల సంఖ్య తగ్గు ముఖం పట్టడం వల్లా గుంట పూలు పూయు నారంభించింది. అలాంటి నిరుత్సాహకర పరిస్థితుల్లో టి.వి. ఉత్పత్తిదారు లనేకులు దుకాణాలు కట్టేసి ఇంటి మొహం పట్టగా, సువర్ణా వారు మాత్రం ఎదుటివారు బలహీను లయ్యే కొద్దీ అదే మోతాదులో తమ బలం పెంచుకో గల 'వాలి'లాగా తమ అపూర్వమైన వ్యూహ రచనా శక్తికి, నిర్దుష్టమైన క్వాలిటీ కంట్రోల్నీ, ఉత్పాదక శక్తినీ జోడించి, భారత దేశపు మార్కెట్ నంతటినీ తమ పాదాక్రాంతం చేసుకో గలిగారు. విజయ మార్గంలో పడ్డ వారికి వద్దన్నా అవకాశాలు వచ్చి పడటం సహజమే కాబట్టి, సువర్ణా వారికి ఆ మధ్యే ఆస్ట్రేలియా నుంచి కూడా ఏడాదికి ఐదు వేల టి.వి. సెట్ల సరఫరాకు ఆర్డర్లు వచ్చాయి.

పదేళ్ల స్వల్ప వ్యవధిలో వారి టర్నోవరు వంద కోట్లు దాటింది. ఆ సందర్భంగా సువర్ణా అధినేత భరద్వాజ గారు 'అభిలాష'లో ఓ బ్రహ్మాండమైన విందూ, కాక్‌టెయిలూ ఇస్తున్నా రా రోజు. తమ సంస్థతో సంబంధం ఉండనీ, లేకపోనీ - హైదరాబాదులోనూ, ఆంధ్ర ప్రదేశ్‌లోనూ ఉన్న ఎన్నదగిన వ్యక్తులందరికీ ఆహ్వానాలు పంపారు భరద్వాజ. అ దో అపూర్వ అవకాశం అనిపించి అందుకున్న అందరూ విందు కొచ్చారు.

మొట్టమొదటి నుంచి సువర్ణా వారికి మేనేజ్‌మెంట్ విషయాల్లో రాజ పురోహితుల్లా సముచిత సలహాల నందిస్తున్న జోషీ గారికి ఆహ్వానం వెళ్లింది - శిష్య సమేతంగా విందుకు రమ్మని. ఇలాంటి వ్యవహారాలకు వాళ్లా అలవాటు పడటం అవసర మనిపించి జోషీగారు తన దగ్గర రీసెర్చి స్కాలర్లుగా పని చేస్తున్న హర్ష, శరత్, మదన్‌లను వెంట తీసుకొచ్చారు.

* * *

ఆనందోత్సాహాల మధ్య విందు సాగిపోతోంది. అంత ఘనమైన విందు 'న భూతో న భవిష్యతి' అని అందరూ అబ్బుర పడటం అప్పుడే ఆరంభమైపోయింది. ఆ విశాలమైన హాల్లో ఎన్నో టేబుళ్లూ, వాటి చుట్టూ కొత్త సబ్బు ముక్కల్లాంటి సీలు విప్పిన పేస్టు ట్యూబు ల్లాంటి ఆహూతులు!

చుక్కల్లో చంద్రునిలా హాలు మధ్య ఉన్న విశాలమైన మేజా అగ్రభాగాన భరద్వాజ గారు. ఆయన రెండు వైపులా సువర్ణా వారి ఉన్నతాధికారులు, రీసెర్చి వింగ్ అధిపతి నటరాజన్, మాన్యుఫాక్చరింగ్ డైరెక్టర్ శేషగిరి, ఎక్స్‌పోర్ట్ డైరెక్టర్ కౌండిన్య కూర్చుని ఉన్నారు. జోషీగారు తమ శిష్య త్రయంతో అదే టేబుల్‌కు ఆవలి పక్కన ఉన్నారు.

మృదుమధుర భాషణలు సాగుతున్నాయి.

గౌరవ పురస్కారాలు అర్హు లందరికీ అందాయి. నృత్య, గాన వినోదాలతో హేలంతో కోలాహలంగా ఉంది. వందలాది వంటకాలూ, లెక్క లేనన్ని పళ్లూ, ఫాలూ, షాంపేన్‌లాంటి శ్రుతి మించని పానీయాలూ అంతు లేకుండా అమృత వాహినిలా ప్రవహిస్తున్నా యక్కడ.

ప్రతి ఒక్కరి మొహంలోనూ ఉల్లాసం, ఉత్తేజం. ఆనందపు టంచులు తాకిన మూర్ఛిల్లిన కళ్లు. అందరి మనసుల్లోనూ సంతృప్తి ... అంతా కోలాహలం. అ దో నిత్య వసంతం.

జోషీగారి శిష్యుల నేదో అనుమానం వేధిస్తున్న ట్లనిపిస్తోంది.

విందు కార్యక్రమం పతాక స్థాయికి చేరనున్న సమయంలో వాళ్ల నోళ్లు విప్పారు.

"సర్! ప్రోగ్రాం బ్రహ్మాండంగా ఉంది. కానీ మా దో సందేహం ..." హర్ష.

"టేబుల్ చివర ముఖ్య స్థానంలో నటరాజన్ ఉన్నారు. ఆయన సాంకేతిక పరిజ్ఞానం, టీ.వీ. టెక్నాలజీలో కొత్త పుంతలు తొక్కగల శక్తీ అందరికీ తెలిసిందే! అంచేత వా రలా ముఖ్య స్థానంలో కూర్చోవడం బాగుంది.

"శేష గిరి గారి మాన్యుఫాక్చరింగ్ నైపుణ్యం అప్పుడే కథలూ, గాథలుగా ప్రజలు చెప్పుకునేతందాకా వచ్చింది. గల్ఫ్ దేశాల వాళ్ల రాత్రికి రాత్రి మూడువేల టీ.వీ.లు కావా లంటే మంత్రదండం తిప్పి పుట్టించినట్టుగా సరఫరా చేసేశాడు!

"ఇహ కౌండిన్య గారి గురించి చెప్పాల్సిం దేముందీ? ఆస్ట్రేలియా లాంటి దేశం నుంచి ఆర్డరు సంపాదించడ మంటే మాటలా! అంతర్జాతీయంగా పోటీదారుల ధోరణులను పసిగడుతూ అగమ్యగోచరమైన అంతర్జాతీయ విపణిలో స్నేహితులను సంపాదిస్తూ సువర్ణా వారికి సువర్ణావకాశాలను అతి లాఘవంగా కల్పిస్తూ ....' ఏకబిగిన చెప్పుకొచ్చిన శరత్, ఊపిరి పీల్చుకోవడం కోసం కాసే పాగాడు.

జోషీ గారు చిరునవ్వుతో వింటూనే ఉన్నారు.

"మరి భరద్వాజ గారిని చూడండి! ఆయనకు నటరాజన్ గారికున్న సాంకేతిక పరిజ్ఞానం లేదు, శేషగిరి గారికున్న మాన్యుఫాక్చరింగ్ నైపుణ్యమూ లేదు, కౌండిన్య గారికున్న మార్కెటింగ్ స్కిల్లూ లేదు. మ రాయన ఛైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్ రెండుకైనట్టు? డబ్బూ, షేర్లూ దండిగా ఉన్నంత మాత్రాన ఆయన అందరినీ మించిన పెద్ద పీటపై కూర్చోవడం సమంజసమే నంటారా?"

జోషీ గారికి శిష్యుల సందేహం అర్థమైంది.

"మన పల్లెటూళ్లలో ఎద్దుల బళ్లూ, గుర్రం బళ్లూ చూసే ఉంటారు కదా!"

'ఏమి టీ రామాయణంలో పిడకల వేట?'

"ఆ బళ్లను ముందుకు నడిపించడంలో చక్రాలకు బలం సమకూర్చే దేదీ?"

ఓ క్షణ మాలోచించి మదన్ సమాధాన మిచ్చాడు - "ఆ చక్రాల ఆకులు కదండీ!"

"మరి ఒకే రకపు ఆకులతో చేసిన రెండు వేర్వేరు చక్రాల శక్తిలో తేడా ఎందు కొస్తున్నట్టు?' ' జోషీగారి మరో ప్రశ్న.

ముగ్గురూ మాట్లాడకుండా ఉండి పోయారు.

జోషీగారు కొనసాగించారు.

"కళ్లకు కనిపించే వాటికే మీ ఊహను పరిమితం చేయకండి. కనిపించని శక్తులను కూడా ఊహించే ప్రయత్నం చేయండి!

"చక్రాల ఆకులు విడివిడిగా పటిష్ఠంగా ఉన్నా, వాటిని ఓ క్రమమైన పద్ధతిలో అమర్చని పక్షంలో చక్రం చేత గాని వాడు వేసినా పందిరిలా తయారవదూ? ఆ చక్రం ఆకృతిలో అంతర్భాగం కాదూ?"

'ఆకులను సరైన రీతిలో అమర్చి వాటన్నిటి విడివిడి శక్తినీ సక్రమంగా సమన్వయపరచ గలిగిన నాడే చక్రపు పాటవం శిఖరాగ్రం చేర గలుగుతుంది. చక్రాలను తయారు చేసే దారు శిల్పి నేర్పరితనమూ, ఏ ఆకును ఎంతెంత దూరం ఎలా అమర్చాలి అన్న విషయంలో అతని అనుభవ పూర్వక నిర్ణయమూ, చిట్టచివరికి బండి చక్రం ఆకృతిని నిర్వచించి నాణ్యతను నిర్ణయిస్తుంది. ఆలోచించండి, సువర్ణా సంస్థలో ఆ దారు శిల్పి ఎవరై? ఆ నిపుణు డెవరూ?'

అప్పుడే పన్నెండవ వస్తోంది. బయట వెన్నెల మనోహరంగా రాజ్య మేలుతోంది. నిదుర కుపక్రమించే యువరాణీ వారు తన నగలను తీసి దాచినట్టుగా హుస్సేన్ సాగర్‌లో ప్రతిఫలిస్తున్న భాగ్య నగరపు దీపాల ఉధృతం తగ్గింది.

కాసేపు ఆలోచనల్లో మునిగి తేలిన తర్వాత హర్ష పెదవి విప్పాడు. 'కానీ సార్, ఓ నిపుణుడు అలా చక్రపు టాకులను సమన్వయ పరచి ఆ ఆకుల విడివిడి బలాల కన్నా ఎంతో ఎక్కువ శక్తి గల బండి చక్రాలను ఎలా రూపొందిస్తాడు? ఏమి టా సమన్వయ రహస్యం?'

"సూర్యరశ్మినే చూడండి!" జోషీ గారు వివరణ సాగించారు.

"చెట్లు పెరగడానికీ, పువ్వులు వికసించడానికీ సూర్యుడే కారణం. వా టన్నిటికీ రవి తన శక్తి పంచి ఇస్తాడు. ఫలితం? చెట్లూ, చేమలూ ఎప్పుడూ సూర్యాభిముఖంగానే ఎదుగుతాయి కదా! అలాగే ఏదైనా సంస్థను నడిపే నాయకుడు కూడా సరైన వ్యక్తులను సరైన స్థానాల్లో నియమించి, వాళ్ల శక్తి సామర్థ్యాలను సరిగ్గా అంచనా వేసి, అవి పరిపూర్ణంగా వికసించే అవకాశాలు కల్పించి, వాళ్లందరి వ్యక్తిగత శక్తులనూ ఏకోన్ముఖం చేసి, అద్భుతమైన ఫలితాలు సాధించ గలుగుతాడు. తన బృందంలోని వాళ్లు సాధించిన విజయాలు, కీర్తి ప్రతిష్ఠలు పూర్తిగా వాళ్లకే అందేలా జాగ్రత్త పడతాడు.

"అలాంటి నాయకుడు నడిపే సంస్థ ఎలా ముందుకు సాగుతుందో ఊహించడం కష్ట మేమీ కాదు కదా! చెట్లు, పువ్వులు సూర్యుని వైపు ఎలా ఎదుగుతాయో, అలానే అనుచరులందరూ అంకిత భావంతో భరద్వాజ లాంటి నాయకుల దిశగా సాగడానికి ఉత్సాహంతో ముందుకు వస్తారు."

